

బాబోయ్ ఎండలు

జిల్లాలో మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎండ తీవ్రతకు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

- మార్చిలోనే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో
- ఉక్కపోతతో ప్రజల అవస్థలు
- మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యం

ఆసిఫాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది రోజులుగా ఎండ లు మండిపోతున్నాయి. మార్చి తొలి వారం నుంచే రోజురోజుకూ ఎండ లు పెరుగుతున్నాయి. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుం డడంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమికి మధ్యాహ్నం వేళల్లో ఇళ్ల నుంచి బటకు వెళ్లేందుకు జంకుతున్నారు. బుధవారం జిల్లాలో చాలా ప్రాంతాల్లో 38 డిగ్రీలు, కొన్ని చోట్ల 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో వ్యవసాయ, ఉపాధిహామీ కూలీలు, కార్మికులు ఇబ్బంది పడు తున్నారు. వేడిమి పెరగడంతో ప్రజలు ఏసీలు, కూలర్లు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. శీతలపానీయాలకు గిరాకీ పెరిగింది. ఎండల కారణంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని, ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

● పగలు ఒకలా.. రాత్రి ఒకలా..

పది రోజులుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా కనిపి స్తోంది. ఉదయం పది గంటల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. 12 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటి నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే రెండు నెలల్లో పరిస్థితి ఎలా ఉండబోతోందనని జనం ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రత గత ఐదు రోజులుగా 37 నుంచి 39.2 డిగ్రీలకు ఉష్ణోగ్రత నమోదు కావడంతో నిప్పుల కొలిమిగా మారింది. గతేడాది మార్చి నెలాఖరు వరకు సాధారణ పగటి ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. కాగా ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా మా రింది. వారం రోజుల నుంచి పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉష్ణోగ్రత తీవ్రత 39 డిగ్రీలకు పెరుగుతుం డడంతో వీధులు, ప్రధాన రహదారిపై జన సంచారం ఉండడం లేదు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా...

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
మార్చి-1	21.9	37.1
మార్చి-2	20.8	37.6
మార్చి-3	18.3	38.1
మార్చి-4	18.0	39.2
మార్చి-5	21.1	39.2

● ఎండ వేడిమికి..

ఎండలో ఎక్కువగా తిరిగినా, పని చేసినా వేడిమికి శరీరానికి తగినంత నీరందక ఖనిజాలు, లవణాలు లోపించి నిస్సత్తువ ఆవరిస్తుంది. దీంతో తీవ్రమైన అలసట కలుగుతుంది. ఒక్కో సారి కండరాలు కూడ పట్టేస్తుం టాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా స్పృహ తప్పుతారు. ఎండలో తిరగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, సొమ్మసిల్లి పడిపోయే ప్రమాదముంది. వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడంతో అతిసార సోకే ప్రమాదముంది. విరేచనాలు, వాంతులు వస్తు నిర్లక్ష్యం చేయ కుండా వైద్యులను సంప్రదించాలి. వ్యక్తిగత పరిశుభ్ర త లోపించడం వల్ల డయేరియా సోకుతుంది. వేసవిలో వడదెబ్బతో ఎక్కువ మంది బాధ పడుతుంటారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు దీని బారిన పడే ప్రమాదముంది. వడదెబ్బ వల్ల కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నప్పుడు వడదెబ్బ సోకుతుంది. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీలకు చేరడంతో స్పృహతప్పుతుంది. ఒళ్లంతా పొడిబారినట్లు అవుతుంది. కొందరికి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది.

● ఇవీ జాగ్రత్తలు..

- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు వ్యవసాయ పనులు చేయవద్దు. బయట తిరగడం, ఆటలు ఆడడం చేయకూడదు.
- తప్పని సరి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్తే తెల్లని రుమాలు ధరించాలి.
- తెలుపు రంగు ఉన్న పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి.
- నీటితో పాటు ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి.
- బయట నుంచి తిరిగి వచ్చిన కొంత సమయం తర్వాత నిమ్మరసం కానీ, కొబ్బరి నీళ్లుగానీ, చల్లని నీరు తాగాలి.
- తీపి పదార్థాలు, తెనె తీసుకోవద్దు.
- వేసవిలో నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ఎట్టి పరిస్థితుల్లో ధరించవద్దు.
- చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే మరింత జాగ్రత్త పడాలి.
- వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వైద్యులను వెంటనే సంప్రదించాలి.

జాగ్రత్తలు పాటించాలి..

- డాక్టర్ సత్యనారాయణ, ఆసిఫాబాద్



వేసవి కాలంలో వడ దెబ్బకు గురి కాకుండా పలు జాగ్రత్తలు పాటించాలి. పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో అవసరమైతే తప్ప బయట తిరగొద్దు. శరీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దు. డీహైడ్రేషన్‌కు గురవకుండా తాగునీటిని అధికంగా తీసుకోవాలి. కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో ప్రయాణించాల్సి వస్తే ముఖానికి రు మా లు కట్టుకోవాలి, టోపీలు, చలువ అద్దాలు, గొడుగు, హెల్మెట్ ధరించం మే లు. చక్కెర, మజ్జిగ, నిమ్మరసం, ఉప్పుకలిపిన నీటిని తరుచూ తాగాలి.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

● ఏడాది పాలన సంతృప్తినిచ్చింది ● కలెక్టర్ వెంకటేష్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం కలెక్టర్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏడాది పాలన సంతృప్తినిచ్చింద న్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన చివరి లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. వసతి గృహాల్లో రాత్రి బస చేయడం వల్ల విద్యార్థుల మంచి చెడు తెలుసుకోవడం వాటిని పరిష్కరించడం సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లాలో వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికతో ముందుకు వెళుతామని చెప్పారు. మిషన్ భగీరథ శాఖాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పైపు లైన్ లీకేజీలు, తదితర సమస్యలను నివారిస్తున్నా మన్నారు. విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లను మార్చ డంతో పాటు కొత్త వాటిని ఏర్పాటు చేయడం, విద్యుత్ లైన్లు సరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 15 మండలాలు, రెం డు మున్సిపాలిటీలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

లింగాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్ అన్నారు. మండలంలోని జాముల్‌ధర గ్రామపంచాయతీలో 185 మంది గిరిజనులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులకు బుధవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచందర్, హౌసింగ్ ఏఈ రత్నం, జాముల్‌ధర పంచాయతీ ప్రత్యేకాధికారి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సిర్పూర్(యు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకాస గ్రామంలో బుధవారం పోలీసుశాఖ అధ్వర్యంలో కోలాం ఆదివాసీలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ గ్రామంలోని దాదాపుగా 40 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, పండ్లు అందజేశారు. ప్రజలతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏటా వేసవిలో తాగునీటి సమస్య ఉంటుందని చెప్పారు. ఏఎస్పీ చిత్తరంజన్ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం

బెజ్జూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో అటవీశాఖ, సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం బుధవారం ముగిసింది. రెండు రోజుల పాటు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి డాక్టర్ మధు, వైద్యులు రాధాకృష్ణ, స్టాలీన్‌బాబు, శ్రీదేవి, ఎఫ్ఆర్వో ముసావీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

సిర్పూర్(టి), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోజు వారి కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్తించిన పనులు నాణ్యతగా చేపట్టాలని చెప్పారు. కార్మదారులకు పని కల్పించేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు అనంతరం నర్సరీని పరిశీలించారు. ఎండల తీవ్రతకు మొక్కలు ఎండి పోకుండా నీరు పోయాలన్నారు. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈవో తిరుపతి, టీఏలు, ఎఫ్ఏలు రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పనిపై సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండు అలాట్‌మెంటు 80 నుంచి 100 లోపు ఉన్నందరినీ పనిలోకి తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించి సూచనలు చేశారు. సమావేశంలో ఏపీవో బుచ్చయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


ఆసిఫాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్/జైనూరు/బెజ్జూరు/కాగజ్‌నగర్/కెరమెరి/సిర్పూర్(యు)/సిరూర్(టి)/దహెగాం/కౌటాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి లోనికి అనుమతించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు జనరల్ విభాగంలో 4,283మంది హాజరు కావలసి ఉండగా 4100 మంది పరీక్షలు రాశారు. 183 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 728 మందికి గానూ 663 మంది హాజరయ్యారు. ఈ విభాగంలో 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావులు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేసి గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర జూనియర్ కళాశాల, వివేకా నంద జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీఐ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై సుధాకర్ బందోబస్తు నిర్వహించారు. సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. జైనూర్ : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకేషనల్, ఇంటర్ మొదటి సంవ త్సరంలో తొలి రోజు 345 మంది విద్యార్థులకు గాను 14 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూరింటెండెంట్ సరస్వతి చెప్పారు. కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో తెలుగు సబ్జెక్టులో 171 మంది విద్యార్థులకు గానూ 15 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర య్యారు.సీఎస్‌గా బైరాగి, డీవోగా ప్రభాకర్ వ్యవహరించారు. దహెగాంలో ఆరుగురు గైర్హాజరు అయి నట్లు చీఫ్ సూపరింటెండెంట్ గణపతి తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు చేపట్టారు. బెజ్జూరు మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 164 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైరాహజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సపన్ మండల్ తెలిపారు. సిర్పూర్(టి) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 336 మంది విద్యార్థులకు గాను 8 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు. కౌటాల,లో జనరల్ విభాగంలో 189 మందికి గాను 176 హాజరయ్యారని అధికారులు తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


కౌటాలలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు


కాగజ్‌నగర్‌లో క్యూలో ఉన్న విద్యార్థినులు

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న అధికారులు

జైనూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొద్ది రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతుండడంతో బుధవారం మరమ్మతులు చేపట్టారు. నీరు రోడ్డుపై వృధాగా పోతూ రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. దీంతో పలువురు మంగళవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్, సీనియర్ నాయ కులు అంబాజీరావ్, గంగారాం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని పాటగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కోలాంగూడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్థులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 25 కుటుంబాలు 200 మంది ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. బోరు బావులు ఉన్నా అందులో నుంచి నీరు రావడం లేదని వాపోయారు. దీంతో తాము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కలెక్టర్ రావాలి సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో మధుకర్, మిషన్ భగీరథ డీఈ ఇర్ఫాన్ అక్కడికి వచ్చి 15 రోజుల్లో సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు దివకార్, ఆనంద్, కార్తీక్, రాజేందర్, టీకానంద్, శ్రావణి, కృష్ణ మాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం కోసం ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పీఎంఆర్‌సి ఏసీఎంఓ ఉద్దవ్ అన్నారు. బుధవారం ఆశ్రమ ఉన్నత పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన

వాంకిడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయక విషయాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టైం మేనేజ్‌మెంట్, గోల్ సెట్టింగ్ తదితర విషయాలపై ట్రైనర్ వడ్లూరి రాజేష్ అవగాహన కల్పించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి


ఎంఈవో సునీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న సమయంలోనే విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకోవాలని ఇంపాక్ట్ చాన్స్ లక్కీ క్లబ్ జిల్లా అధ్యక్షురాలు చెంచు లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు బుధవారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు కీలకమని, చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొనేందుకు సమయాన్ని కేటాయించాలని సూచించారు. అనంతరం ఎంఈవో సునీతను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విష్ణువర్ధన్, రాజేశం, దుర్గాపద్మ, మౌనిక, శృతి, సుజాత, లక్ష్మీ, కవిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

బెజ్జూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. సోమిని ఆశ్రమ పాఠశాలలో మొగడ్‌దగడ్, సలుగుపల్లి, సోమిని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, ఏటీడీఓ ఖమర్‌హుస్సేన్, ఎంఈవో సునీత, ప్రధానోపాధ్యాయులు భిక్షమయ్య, ప్రసాద్, వార్డెన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

జైనూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎస్సై సాగర్ అన్నారు. బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని హెడ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ ఎంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

రమేశ్, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకం గా తనిఖీలు చేస్తూ కార్యదర్శులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. చెత్తాచెదా రం ఎప్పటికప్పుడు తొలగించేలా అప్రమత్తం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పనుల స్థలాల్లో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: ఉపాధిహామీ పనులు చేసే చోట కూలీలు ఎండలకు ఇబ్బందులు పడ కుండా చర్యలు తీసుకుంటున్నాం. వడదెబ్బ తాక కుండా తీసుకునే చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. తాగునీరు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: గ్రామాల్లోని పెండింగ్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధుల కోసం ప్రతిపాదనలు అందజేశాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

అతివలకు అండ

ఇందిరా మహిళా శక్తి పథకంలో స్వయం ఉపాధి యూనిట్లు

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు



12 రకాల యూనిట్లు..

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతని స్తోంది. ఈ పథకం కింద మహిళా సంఘాలకు రుణా లను ఇస్తోంది. ఈ క్రమంలో కుమరం భీం జిల్లాలో ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్లు ఏర్పాటు చేసుకు న్నారు. అలాగే మెడికల్ షాపులు, బోటిక్, డీజిల్ రోలింగ్, క్లాత్ స్టోర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంబ్రాయిడరీ దుకాణాలు ఏర్పాటుకు రూ. 15 లక్షల లక్షల వరకు రుణాలిస్తున్నా రు. ఒక్క కాగజ్‌నగర్ పట్టణంలోనే మెప్మా ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 60 యూనిట్లకు రూ2 కోట్ల రుణాలు విడుదల చేశారు.

గ్రామైఖ్య సంఘాలు, స్వయం సహాయక సంఘాల ఉపాధి కోసం 12 రకాల యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో పాడి పశువులు, మీ సేవా కేంద్రాలు, సోలార్ మొబిలైజేషన్, కుటీర పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్లు, మిల్క్ పార్లర్లు, అద్దె క్యాంటీన్లు, క్యాటరింగ్, బ్యూటీపార్లర్, ప్రింటింగ్, సౌండ్ సిస్టం, డెకరేషన్, టెంట్ హౌస్‌ల నిర్వహణ వంటి యూనిట్లు ఉన్నాయి.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్సీ దండే విఠల్ (ఫైల్)

ఆర్థిక స్థితిని మెరుగు పరిచేందుకు..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్థితిని మెరుగు పరిచే ఉద్దేశంతో ఈ పథకం రూప దిద్దుకున్నది. ఈ పథకంలో మహిళలు ప్రయోజనం పొందేందుకు మెప్మా సిబ్బంది ప్రత్యేకంగా సాయం అందించనున్నారు. తెలంగాణలో ఇప్పటికే ప్రాధాన్యం కలిగి ఉండి ద్వారా ఇతర స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం ఉం డాలి. ఇలా ఉన్న వారిని మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. గతంలో రుణ వాయి దాలు సక్రమంగా చెల్లించిన వారికే ప్రాధాన్యం ఇస్తు న్నారు. ముఖ్యంగా పారిశ్రామి కంగా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక వనరులు అంతంత మాత్రంగా ఉన్న వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇం దిర మహిళా శక్తి స్కీం ఎంత గానో ఉపయోగపడుతుంది. మహిళా స్వయం సహాయ సం ఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా పెద్ద ఎత్తున రుణాల ను ఇప్పించి ఒక్కొక్క సంఘా నికి రూ.2 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు అందజే స్తున్నారు. ఈ పథకం ప్రాజెక్టులతో సంబంధించిన పూర్తి అంశాలతో కూడిన దరఖాస్తులు చేసుకుంటే సంబంధిత మెప్మా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవ గానే గ్రూపు సభ్యుల వివరాలు తీసుకొని రుణాన్ని విడుదల చేస్తున్నారు.

డ్రైక్లినింగ్ వ్యాపారానికి దరఖాస్తు

సరిత, శారీ రోలింగ్ సెంటర్, కాగజ్‌నగర్

మహిళా సంఘాల ద్వారా మెప్మా ఆధ్వర్యంలో డ్రైక్లినింగ్ వ్యాపారం ఏర్పాటు చేసేందుకు దరఖా స్తులు చేసుకున్నాం. రూ.5 లక్షలు మంజూరైంది. డ్రైక్లినింగ్ చేసేందుకు ముందస్తుగా శిక్షణ కూడా తీసుకున్నాం. వాయిదాలు క్రమంగా చెల్లిస్తున్నాం.



బోటిక్ ఏర్పాటుకు రుణం మంజూరు..

శ్యామల, బోటిక్ దుకాణం, కాగజ్‌నగర్

బోటిక్ ఏర్పాటుకు రూ.5 లక్షల రుణం మంజూ రైంది. గతంలో ఎలాంటి కిస్తీ పెండింగ్‌లో లేదు. అధికారుల చొరవతో త్వరగా రుణం మంజూరైంది. మార్కెట్‌లో గిరి ఆదరణ తీసుకున్నాను. ప్రస్తుతం వ్యాపారం పుంజుకుంటోంది.



దరఖాస్తులు అందిన వెంటనే పరిశీలన..

మోతీరాం, మెప్మా జిల్లా కోఆర్డినేటర్

మహిళలు యూనిట్ల ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులు అందిన వెంటనే పరిశీలిస్తు న్నాం. గతంలో తీ సుకున్న రుణాలు, వాయిదాల చెల్లింపులపై ఆరా తీస్తున్నాం. ఇప్పటి వరకు 60 గ్రూపులకు, రూ.2 కోట్ల మేర రుణాలు అందజేశాం.



బాలికలు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

ఆసిఫాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఏకాగ్రతతో కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో బుధవారం జిల్లా మహిళా, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో- బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపా డుకుంటూనే చదువులో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో మహిళా సాధికారత కేంద్రం సమన్వ యకర్త శారద, ఎస్‌వో నలంద, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

వాంకిడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధ గురువు బంతే దర్శపాది అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. మహనీ యుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని మన పిల్లలను ఉన్నత చదువులు చది వించి గొప్ప వారిగా తీర్చిదిద్దాలన్నారు. పిల్ల లు సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఎదిగితే తల్లిదండ్రులకు అంతకుమించి సంతోషం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో అం బేద్కర్ సంఘం నాయకులు, బౌద్ధ గురు వులు రాహుల్ బోధి, నిబ్బాణ్, జయరాం, సునీల్‌కుమార్, విలాస్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, రోషన్, జైపాల్, ముకుందరావు, శివాజీ కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

దండేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్‌లో కాంద్రాపు మల్లేషం(79) అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తైసినోద్దీన్, మృతుడి కూతురు తెలిపిన వివరాల ప్రకా రం.. కాంద్రాపు మల్లేషం అనే వృద్ధుడు తన భార్య, ఇద్దరు కొడుకులను కోల్పోయాడు. వారిని తలుచుకుంటూ బాధ పడుతుండేవాడు. ఇదేక్రమంలో మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వచ్చి చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కూతురు కాంద్రాపు రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తైసినోద్దీన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాండూర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): అచ్చులాపూర్ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రాజయ్య (57) అనే వ్యక్తి రోడ్డు ప్రమా దంలో గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెంద డు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన రాజయ్య ఐబీ నుంచి నయారా పెట్రోల్ బంకు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. రేచిని గ్రామానికి చెందిన బీమ్‌రావు అనే వ్యక్తి ద్విచక్రవాహా నంపై రాంగ్‌రూట్‌లో వచ్చి రాజయ్య బైక్‌ను ఢీకొట్టాడు. రాజయ్యకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రాజయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన బీమ్‌రావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నెన్నెల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన తోకల రాజేశం (34) అనే యువకుడు చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం ఏడాదిగా అత్తగారి ఊరైన నెన్నెల మైలారంలో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రాజేశం తాగిన మైకంలో ఫిబ్రవరి 28న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రైలులో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ పట్టుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు రైలులో సోదాలు చేయగా ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడిందని చెప్పారు. బియ్యంను తూకం వేసి స్థానిక డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు. కాగా బియ్యంను తరలిస్తున్న వ్యక్తులు పరారులో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

పట్టభద్రుల స్థానంలోనూ బీజేపీ విజయం

- రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచిన చిన్నమైల్ అంజిరెడ్డి
- సిట్టింగ్ స్థానాన్ని 'చే'జార్చుకున్న కాంగ్రెస్
- బీఎస్పీకి తప్పని నిరాశ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కిం చుకున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో నూ పాగా వేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాను తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నానని ఆ పార్టీ చాటుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి మూడు ప్రచార సభల్లో ప్రసంగించి వెళ్లినా సిట్టింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ స్థానంలోనూ బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ మరోసారి పట్టునిరూపించుకున్నది. బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి రెండో ప్రాధాన్య ఓట్లతో అక్కడ విజయం సాధించారు. ఆయనకు సమీప కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఓట్ల ఆధిక్యం లభించింది. 56 మంది పోటీ చేసిన ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నువ్వా.నేనా అన్నట్లు పోటీపడ్డారు. తొలి ప్రాధాన్య ఓట్లతో ఎవరికీ కోటా ఓటు లభించక పోవడంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండో ప్రాధాన్య ఓటును లెక్కించి విజేతను ప్రకటించారు. మొత్తం 2,52,029 ఓట్లు పోలకాగా, 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2,23,343 ఓట్లు చెల్లుబాటు కాగా అభ్యర్థి గెలుపునకు 1,11,672 ఓట్లను కోటా ఓట్లుగా నిర్ణయించారు. తొలి ప్రాధాన్య ఓట్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డికి 70,565, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డ ముగ్గురు అభ్యర్థులకు 2,06,659 ఓట్లు పోలయ్యాయి. పోటీలో ఉన్న మిగతా 53 మందికి 16,684 ఓట్లు వచ్చాయి. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో గెలుపునకు అవసరమైన కోటా ఓట్లు 1,11,672 ఓట్లు ఎవరికి రాక పోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపును చేపట్టారు. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి మొదలుకొని ఎలిమినేషన్ చేస్తూ రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ వచ్చారు. అత్యధిక ఓట్లతో మొదటి రెండు స్థానాల్లో ఉన్న బీజేపీ అంజిరెడ్డి, కాంగ్రెస్ నరేందర్‌రెడ్డి మినహా 54 మంది ఎలిమినేట్ అయినా కోటా ఓటు ఎవరికీ లభించలేదు. దీంతో ఆ ఇద్దరిలో అత్యధిక ఓట్లు సాధిం చిన బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డిని విజేతగా ప్రకటించారు.

● నాలుగు రౌండ్లలో మినహా అన్నింటిలోనూ బీజేపీదే పైచేయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 3న ప్రారంభమై 5వ తేదీ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. మొదటి రోజు చెల్లని ఓట్లను గుర్తించి వాటిని మినహాయించి, 25 ఓట్లకు ఒకటి చొప్పున కట్టలు కట్టడానికే సరిపోయింది. అసలు ఓట్ల లెక్కింపు 4వ తేదీ ఉదయం 11.30 గంటలకు ప్రారంభమై 5వ తేదీ రాత్రి వరకు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. చెల్లిన ఓట్లు 2,23,343 కాగా వీటిని 11 రౌండ్లలో లెక్కించారు. తొలి ఐదు రౌండ్లలో బీజేపీ ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చింది. ఆరు నుంచి తొమ్మిది రౌండ్ల వరకు కాంగ్రెస్ పై చేయిగా నిలువగా మళ్లీ 10, 11 రౌండ్లలో బీజేపీ ఎక్కువ ఓట్లను తెచ్చుకొని మొదటి ప్రాధాన్య ఓట్లలో 5,110 ఆధిక్యాన్ని సాధించింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ ముగ్గురు ప్రధాన అభ్యర్థులకు నువ్వా.నేనా అన్నట్లుగానే ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి తొలి ప్రాధాన్య ఓట్ల ఆధిక్యత కంటే ఓట్లు పెరిగి అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 70,565, ప్రసన్న హరికృష్ణకు 60,419, యాదగిరి శేఖర్‌రావుకు 3,636, ముస్తాక్ అలీకి 2,701, సర్దార్ రవీందర్‌సింగ్‌కు 2,047 మొదటి ప్రాధాన్య ఓట్లు లభించాయి.



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

● సిట్టింగ్ స్థానం 'చే'జారింది..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత టి జీవన్‌రెడ్డి ఉన్నారు. ఆయన ఈసారి పోటీకి సుముఖంగా లేక పోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. బీజేపీ సి అంజిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. 56 మంది పోటీలో ఉన్నా ఈ ముగ్గురు మధ్యే ప్రధాన పోటీ జరిగింది. హోరాహోరీగా సాగిన పోరులో కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోగా, బీజేపీ గెలుపొందింది.

ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న అధికారులు

కౌటాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని అటవీ శాఖ ఆధీనంలో ఉన్న భూమిలో నిర్మాణాలు చేపడుతు న్నారంటూ అధికారులు బుధవారం నేరేళ్ల జనార్దన్ అనే వ్యక్తి ఇంటి పనులను అడ్డుకున్నారు. జనార్దన్ అటవీ భూమిలో అక్రమంగా భూక్జా చేసినట్టు మంగళ వారం అటవీ శాఖ అధికారులు నోటీసులు అందించారు. ఎలాంటి పనులు చే యకూడదని ఆదేశించారు. అయినా కూడా పనులు చేపట్టడంతో బుధవారం అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తమకు గతంలో కలెక్టర్ ఇంటి నిర్మాణానికి అనుమ తి ఇచ్చారని, కొత్తగా ఎలాంటి ఆక్రమణలు చేయడం లేదని బాధితుడు చెబుతున్నాడు.

డీఎల్‌పీవో విచారణ

బెజ్జూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బె జ్జూరు మండలం లంబాడీగూడ గ్రామ పం చాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై డివిజనల్ డీఎల్‌పీవో ఉమర్ విచారణ చేపట్టారు. ఇటీవల గ్రామంలో పలువురి వద్ద నుంచి కార్యదర్శి ఇంటి నంబర్ల కోసం డబ్బులు తీసుకోవడంతో పాటు అక్రమాలకు పాల్ప డుతున్నారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శిపై గ్రామస్థుల సమక్షంలో విచా రణ జరిపినాం. నివేదికను కలెక్టర్‌కు పంపి స్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో గౌరి శంకర్ ఉన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

కౌటాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కౌటా లలోని ఇన్నాంట్ జీసస్ పాఠశాలలో బుధ వారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్‌కు సంబంధించిన ప్రయోగా లను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎస్సై మధుకర్ సందర్శించి ప్రయోగాల తీరుతె న్నులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కొత్త, కొత్త ప్రయోగాలపై దృష్టి సారిం చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠ శాల టాండాసన్, ఉపాధ్యా యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏరియా లోని సివిల్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూ సీ బ్రాంచి కార్యదర్శి నరేంద్ర సత్యనారాయణ, ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్ అన్నారు. స్థానిక సివిల్ డిపార్ట్‌మెంట్‌లో బుధవారం నిర్వహిం చిన గేట్‌మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. సింగరేణి క్వార్టర్ల మధ్యలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను తక్షణమే పరిష్కరిస్తామని యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఏరియాలో కార్మికు ల సంక్షేమం కోసం యాజమాన్యంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. సివిల్‌డిపార్ట్‌మెంట్‌లో కార్మికులకు సంబంధించిన ప్రమోషన్ల విషయంలో యాజమాన్యం మార్చి తరువాత అమలు చేస్తామని అంగీకరించిందని చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల విష యానికొస్తే హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించే విధంగా తమ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు సీఅండ్‌ఎండీ బలరాంతో మాట్లాడారని తెలి పారు. సమావేశంలో నాయకులు టి తిరుపతి, జి దినేష్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, కె. శ్రీనివాస్, మర్రి కుమార్, శర్మ, ఓదెలు, సంజీవ్, వెంకటేశ్వర్లు, రాజేందర్‌లు తదితరులు పాల్గొన్నారు. కాగా మం దమర్రి ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పలువురు కార్మికులు బుధవారం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నరేంద్ర సత్యనారాయణ సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీలో చేరిన వారి లో నాయకులు బండి సదానందం, ఎండీ నయా మోద్దీన్, పున్నం, శ్రీనివాస్, రాజయ్య, నరేశ్, వెంకటేశ్, శ్రీకాంత్, రవీందర్, గణపతి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నరేంద్ర సత్యనారాయణ

పనులతోనే ఉద్యోగులకు గుర్తింపు



పదోన్నతిపై వెళ్తున్న అధికారిని సన్మానిస్తున్న అధికారులు


మందమర్రిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మనం చేసే మంచి పనులతోనే గుర్తింపు ఉంటుందని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం అబ్దుల్ ఖదీర్ అన్నారు. ఏరి యాలోని జీఎం కార్యాలయంలో ఎస్టేట్ అధికారిగా పని చేస్తూ పదోన్నతిపై మణుగూరుకు బదిలీపై వెళ్తున్న స్వప్న ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మా ట్లాడారు. ఏరియా అభివృద్ధికి ఆమె చేసిన సేవలు అభినం దనీయమని తెలిపారు. మణు గూరులో కూడ మంచి పేరును సాధించాలని ఆయన ఆకాం క్షించారు. సింగరేణిలో సంస్థ అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమానికి పాటుపడే అధి కారులకు కార్మికులు ఆదరిస్తూనే ఉంటారని తెలిపారు. అనంతరం ఆమెను శాలు వాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రవీందర్, అన్ని గనుల డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతిఖని గని లాంగ్‌వాల్ ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ

బెల్లంపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గని లాంగ్‌వాల్ ప్రాజెక్టు విస్తర ణ కోసం గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ఇప్పటికే సింగ రేణి అధికారులు లాంగ్‌వాల్ ప్రాజెక్టు విస్తరణ కోసం ప్రభావిత గ్రామాలైన బ ట్వాన్‌పల్లి, లింగాపూర్, పెర్కపల్లి, ఆకెన పల్లి, బుచ్చయ్యపల్లి, పాతబెల్లంపల్లి గ్రామా ల ప్రజలకు సమాచారం ఇచ్చారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

శ్రీరాంపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఇన్ చార్జి డీజీఎం(పర్సనల్) ఎస్‌వి రాజేశ్వర్ రావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పుర స్కరించుకొని నస్పూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్ మహిళలకు బుధవారం ఆటల పో టీలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవ ఏరియా కోడినేటర్ పీటీ రణదీప్ గౌడ్ పాల్గొన్నారు.



జీఎంను సన్మానించిన అధికారులు

శ్రీరాంపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌ను సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి గుండా శ్రీనివాస్ బుధవారం మనంగా సన్మానించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల, సింగరేణి పాఠశాల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల మైనింగ్ హెచ్ఓడీ నరసింహస్వామి, పాఠశాల హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి



ఓసీపీని తనిఖీ చేస్తున్న డైరెక్టర్(ఈ అండ్‌ఎం) సత్యనారాయణరావు

శ్రీరాంపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓసీపీలో ఉన్న భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి సత్య నారాయణరావు అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీని, సిహెచ్‌పీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనం తరం మాట్లాడుతూ, యంత్రాలను అవస రమైన విడిభాగాలను సిద్ధంగా ఉంచుకోవాల న్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కార్పొరేట్ జీఎం(సీహెచ్‌పీ) తిరుమలరావు, ఎస్ఓ టు జీ ఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ పీవో శ్రీనివాస్, కార్పొరేట్ డీజీఎం(సీహెచ్‌పీ) కేశవరావు, డీజీఎం(వర్క్‌షాప్) రవీందర్, క్వాలిటీ ఇన్‌చార్జి కె వెంక టేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ నాగ రాజు, మేనేజర్ బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సిద్ధంగా ఉండాలి

జైపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాబోయే కాలంలో ఎస్టీపీపీలో మూ డో యూనిట్ పనులు ప్రారంభం కావచ్చని, అధికారులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. ఎస్టీపీపీలోని పవర్ ప్లాంట్‌ను బుధవారం సందర్శించారు. మూడో యూనిట్ ప్లాంట్‌కు సంబంధించిన స్థలం, ఫైనల్ నిర్మించే స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, అధికా రులు జీవన్ సింగ్, ప్రసాద్, వేణుగోపాలరావు, సముద్రాల శ్రీనివాస్, చంద్ర మణి,తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాపీమేస్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాపీ మేస్త్రీల సంఘం గౌరవ అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తాపీ మేస్త్రీల భవన కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితోపాటు పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణ చొరవతో తాపీ మేస్త్రీలకు అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘం సభ్యులంతా సంఘటితంగా ఉంటే హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సదానందం యాదవ్‌ను సన్మానించారు. సమావేశంలో తాపీ మేస్త్రీల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారికి సన్మానం

జైపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో అడిషనల్ జనర్ మేనేజర్ ఫైనాన్స్‌గా పనిచేసి గత నెలలో పదవీ విరమణ పొందిన సుధాకర్‌ను బుధవారం ఎస్టీపీపీలో ఆఫీసర్స్ అసోసియేషన్ తరుపున సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఇన్‌చార్జీ ఈడీ శ్రీనివాసులు, అధికారులు జేఎస్ సింగ్, సముద్రాల శ్రీనివాస్, సంతోష్‌కుమార్, మదన్ మోహన్, ప్రసాద్, మురళీధర్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట-బల్లార్షా రైలును పునరుద్ధరించాలి

మందమర్రిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో నిలిపివేసిన కాజీపేట నుంచి బల్లార్షా రైలును తిరిగి ప్రారంభించాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం వినతి పత్రం అందించారు. వివిధ పనుల నిమిత్తం ప్రయాణీకులు బల్లార్షా వరకు, ఇటు కాజీపేట వరకు వెళ్తుంటారని, రైలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైలు పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు. దీనిపై కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

మల్టీవర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, మార్చి 5 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బూదకుర్తి, బట్వాన్‌పల్లి, చాకపల్లి, సోమగూడెం గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న మల్టీవర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఐదు నెలలుగా మల్టీవర్కర్స్‌కు వేతనాలు రావడం లేదని, దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎమ్మెల్యే సంబంధిత ఎంపీడీవో, ఎంపీవోలతో మాట్లాడి వేతనాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కారుకూరి రాంచందర్, సింగతి సత్యనారాయణ, బత్తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

పశువులు మేతకు వెళ్లేందుకు దారి ఇవ్వాలి

కోటపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అడవిలోకి పశువులు మేతకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని బుధవారం రొయ్యలపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండగా దీన్ని పరిశీలించిన గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పశువులు అడవిలోకి మేతకు వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే పశువులను అమ్ముకోవాల్సిందేనని వాపోయారు. అటవీ అధికారులు ఆలోచించి పశువులు మేతకు వెళ్లే దారి మూయవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు రాజమల్లు, ఎర్మ పున్నం, శ్రీశైలం, రాజం, బాపు, కిష్టయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలి

కోటపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి నెలకొందని, ఈ సమస్యను తీర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య బుధవారం కోరారు. ఆ కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ఉన్న బోరు చెడిపోయిందని, దీంతో నీటి ఎద్దడి నెలకొందన్నారు. దీనిపై ఎమ్మెల్యే వివేక్ స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఇదే గ్రామంలోని బారెగూడెంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపై నీరు చేరి దోమలు వ్యాపిస్తున్నాయని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు ఆటల పోటీలు

చెన్నూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపల్ పట్వర్ధన్, వైస్‌ప్రిన్సిపల్ కిశోర్‌కుమార్, మహిళ సాధికారత విభాగ సమన్వయకర్త శిరీష ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి మహిళ దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

కన్నెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరాపూర్ గ్రామంలో గల మొక్క జొన్న పంటలను బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు సురేఖ పరిశీలించారు. మొక్క జొన్న పంటలో హానీ కలిగించే పురుగులను గుర్తించి నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. అనంతరం డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రశాంత్, ఏఈవో విజయ్, రైతులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో హన్మంత్‌పల్లి వాసి మృతి

లక్సెట్టిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంత్‌పల్లి గ్రామానికి చెందిన గుమ్ముల కొమురయ్య(48) అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం ఒమన్‌కు వెళ్లాడు. వారం రోజుల క్రితం విధి నిర్వహణలో భాగంగా బిల్డింగ్‌పై పనిచేసుకుంటూ కిందపడి మృతి చెందాడు. కాగా మృతదేహం బుధవారం గ్రామానికి చేరుకుంది. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమతి జన్నారం మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్ స్పందించి ఇండియన్ కౌన్సిలేట్, కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మృతదేహం వచ్చేలా చేశారు.

సీజన్‌కు ముందే నకిలీ విత్తన దందా


నిషేధిత లూజు విత్తనాలు

- దొడ్డిదారిన పల్లెలకు చేరుతున్న నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలు
- కలుపు సమస్య ఉండదని గ్లైసిల్ వైపు రైతుల మొగ్గు
- భీమిని మండలంలో 2.70 క్వింటాళ్ల లూజు విత్తనాలు పట్టివేత
- గడ్డి మందు గ్లైఫోసెట్‌తో పర్యావరణానికి ముప్పు

నెన్నెల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పత్తి సీజన్ ఇంకా ముగియక ముందే రాబోయే సీజన్ కోసం నకిలీ విత్తన దందా మొదలైంది. ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 (గ్లైసిల్) విత్తనాలు దొడ్డిదారిన పల్లెలకు చేరుతున్నాయి. సీజన్ ప్రారంభంలో పోలీసు నిఘా ఉంటుందని భావించిన వ్యాపారులు... ఇప్పటి నుంచే ఇతర రాష్ట్రాల నుంచి క్వింటాళ్ల కొద్ది నకిలీ పత్తి విత్తనాలను దిగు మతి చేసుకుంటున్నట్లు తెలిసింది. సోమవారం భీమిని పోలీసులు రూ. 6.85 లక్షల విలువ చేసే 2.74 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలను పట్టుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నకిలీ వితనాలు అమాయక రైతులకు అంటగట్టేందుకు కేటుగాళ్లు ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తున్నారు. అధికారులు అప్రమత్తం కాకపోతే గ్లైసిల్ పత్తి సాగుతో రైతాంగం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కలుపు నివారణ కోసం వినియోగించే నిషేధిత గ్లైఫోసెట్ మందుతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.


భీమిని మండలం మల్లీడి వద్ద పోలీసులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

ముందుగానే ఎందుకంటే...

సీజన్ ప్రారంభంలో గ్లైసిల్ దందాపై ప్రభుత్వ నిఘా ఉంటుందని భావించిన వ్యాపారులు.. మూడు నెలలు ముందుగానే ఇతర రాష్ట్రాల నుంచి క్వింటాళ్ల కొద్ది నకిలీ పత్తివిత్తనాలను దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిసింది. వాటిని పల్లెలకు చేర్చి రైతులకు అంటగట్టే పనిని మొదలు పెట్టేశారు. నిరుడు గ్లైసిల్ విత్తనాల్లో కల్తీ వల్ల నష్టపోవడంతో దళారులను రైతులు నమ్మడం లేదు. కావాల్సిన వారికి ముందుగానే విత్తనాలు ఇచ్చి పరీక్షించుకునే అవకాశం ఇస్తున్నట్టు తెలిసింది. కొన్ని విత్తనాలను పెరట్లో విత్తుకోవాలని చెబుతున్నారు. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటే.. వాటిపై గ్లైఫోసెట్ మందు స్ప్రే చేసుకోవాలని సూచిస్తున్నారు. మందు పిచికారి తర్వాత కూడా మొక్కలు ఎండిపోకుండా ఆరోగ్యంగా ఉంటేనే విత్తనాలు తీసుకోవాలని సూచిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రక్రియకు కనీసం నెల రోజుల సమయం పడతుంది కాబట్టి ముందుగానే విత్తనాలు గ్రామాలకు చేర్చే పనిలో పడ్డారు. యేటా మే రెండోవారం నుంచి విత్తన దందా ప్రారంభమవుతుంది. కాని ఈ సారి మార్చిలోనే షురూ చేశారు. ఓ వైపు అధికారులు గ్లైసిల్ విత్తనాలు వాడ కూడదని ప్రచారం చేపడుతుండగా.. మరోవైపు గుట్టు చప్పుడు కాకుండా నకిలీ విత్తనాలు గ్రామాలకు చేరుతూనే ఉన్నాయి.

మొదటికే మోసం...

గత సంవత్సరం అధికారుల నిఘా, పోలీసు నిర్బంధం వల్ల రైతులు వర్షాకాలం ప్రారంభం నాటికి కూడా విత్తనాలను కొనుగోలు చేసుకోలేదు. ఒకరిద్దరు రైతులు బీజీ-3 విత్తనాలు విత్తే సరికి అందరూ వాటి వేటలో పడ్డారు. ఒకేసారి అందరికి విత్తనాలు అవసరమయ్యే సరికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో ఇదే అదనుగా దళారులు ధరను అమాంతం పెంచడంతో పాటు గ్లైసిల్ విత్తనాల్లో కల్తీ చేసి విక్రయించారు. విత్తనాలు దొరకడమే బంగారంగా భావించిన రైతులు ఎక్కువ ధరకు కొని విత్తుకున్నారు. సకాలంలో వర్షాలు కురిశా యి. మొలకలు బాగానే వచ్చాయి.

నెల రోజులకుగాని రైతులకు అసలు విషయం బోదపడలేదు. గ్లైసిల్ విత్తనాలే అనే ధీమాతో చేలోని కలుపును పట్టించుకోలేదు. కలుపు కొంత ముదరినాక మందు కొట్టి నివారించుకోవచ్చు అనుకున్నారు. కలుపు పెరిగినాక చేలకు నేరుగా గ్లైఫోసెట్ మందును స్ప్రే చేశారు. నాసిరకం గ్లైసిల్ విత్తనాలు కాబట్టి కొందరి చేలల్లో కలుపుతో పాటు పత్తి మొక్కలు కూడా మాడి పోయాయి. చేనంతా ఎండిపోవడంతో మొదటికే మోసం జరిగిందంటూ లబోదిబోమన్నారు. మరికొందరు రైతులు చేనులోని కొన్ని మొక్కలపై మందు పిచికారి చేసి పరీక్షించి చూసుకున్నారు. కూలీలతో కలుపు తీపించాలనుకున్నా అప్పటికే విపరీతంగా కలుపు పెరగడంతో ఖర్చులకు తట్టుకోలేక పంట వదులుకున్న వారున్నారు. కొందరి చేలల్లో మందు ప్రభావంతో ఆకులు గిడసబారి మొక్కల్లో పెరుగుదల నిలిచి పోయింది. కొన్నిచోట్ల చెట్లు ఏపుగా పెరిగాయి కాని పూత, కాత రాలేదు. మరికొందరి చేలల్లో కాత కాసినప్పటికీ కాయ సైజు పెరగలేదు. ఇలా పలు విధాలుగా నకిలీ, కల్తీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కోట్లలో దందా...

మంచిర్యాల జిల్లాలో వానాకాలంలో 2.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. వచ్చే సీజన్‌లో మరో 20 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఇక్కడ సాగు భూమి లభించని వారు పక్క జిల్లాలతో పాటు పొరుగున ఉండే మహారాష్ట్రలో భూములను కౌలుకు తీసుకొని పత్తి పండిస్తున్నారు. ఒక్కో కౌలురైతు 10 నుంచి 50 ఎకరాల వరకు పత్తి సాగు చేస్తున్నారు. పదుల ఎకరాల్లో పత్తిసాగు చేసే తాము బ్రాండెడ్ పత్తి విత్తనాలు వాడితే కలుపు తట్టుకోవడం కష్టమని వారంటున్నారు. కూలీల కొరత కారణంగా అదనులోగా కలుపు తీయలేక నష్టపోతామని పేర్కొన్నారు. కౌలు రెతులు, ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసే బడా రైతులందరు గ్లైసిల్ విత్తనాల వైపే మొగ్గు చూపుతారు. మొత్తం పత్తి సాగు విస్తీర్ణంలో బ్రాండెడ్ విత్తనాలను 30 శాతం రైతులు వాడితే, మిగతా వారంతా గ్లైసిల్ సాగు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. జిల్లాలో 5.5 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు (30 టన్నుల లూజు విత్తనాలు) అవసరం అవుతాయి. 500 గ్రాముల ఒక్కో గ్లైసిల్ విత్తన ప్యాకెట్ ధర వెయ్యి నుంచి రూ. 1200 వరకు ఉంటుంది. లూజు విత్తనాలు రూ. 2 వేల నుంచి రూ. 2500లకు కేజీ అమ్ముతారు. దీంతో జిల్లాలో దాదాపుగా రూ. 70 కోట్ల నుంచి రూ. వంద కోట్ల వరకు నకిలీ విత్తన వ్యాపారం నడుస్తుందనే విషయం స్పష్టమవుతోంది.

అవగాహన కల్పిస్తేనే మేలు..

పత్తిలో సాధారణ బీటీ రకాలను సాగు చేసి కూడా లాభాలు గడించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వాటిలో కలుపు నివారణ కోసం మార్కెట్లో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. నిర్దేశిత సమయం లోగా మందులు పిచికారి చేయాల్సి ఉంటుంది. పొడి దుక్కి లోనే స్ప్రే చేసుకునే పెండామిథిలిన్, విత్తనాలు వేసిన 20 రోజుల్లోగా కలుపు లేతగా ఉన్నప్పుడు స్ప్రే చేసుకునే క్విజలోఫాల్ ఏథిల్ లేదా ప్రొపాఖిజాపాప్, ఫైరథోబాక్ సోడియం లాంటి ప్రభావవంతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. అదనులోగా పిచికారి చేస్తే ఈ మందులు కలుపును సమర్థవంతంగా నివారిస్తాయి. పత్తి చెట్లపై మందు పడకుండా సాళ్ల మధ్యన కలుపుపై మాత్రమే పిచికారి చేసుకునే గ్లుఫోసినేట్ అమ్మోనియం (స్విఫ్‌పవర్), ప్యారాక్విట్ మందులు తక్కువ ధరకే లభిస్తాయి. బీటీ రకాల్లో చీడపీడలు, కాయతొల్చు, శనగపచ్చ పురుగులను తట్టుకునే శక్తి ఉంటుంది. కాని గ్లైసిల్ పత్తికి చీడపీడల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గ్లైసిల్ పత్తి కంటే బ్రాండెడ్ పత్తి నాణ్యతగా ఉండటంతో పాటు దిగుబడి ఎక్కువగా వస్తుంది. కాయ సైజు పెద్దగా ఉండి పింజ పొడవుగా ఉంటుంది. దీంతో మంచి ధర లభిస్తుంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న బ్రాండెడ్ పత్తి విత్తనాలు, కలుపు నివారణ మందుల గూర్చి రైతుల్లో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

వైభవంగా నవగ్రహ శాంతి హోమం

నస్పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా బుధవారం విశేష నక్షత్ర సహిత నవగ్రహ శాంతి హోమాలు, క్షీర, సహస్ర కలశాభిషేకం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం గోపూజ, తులసీ పూజ, రుద్రసహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చన, విష్ణు సహస్ర నామ, లలిత సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణ, బిల్వార్చనలు పూజలు జరిగాయి. కృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి ఆద్వర్యంలో ఆద్వర్యంలో అయుత చండీ, అతిరుద్ర మహాయాగంలో భాగంగా భక్తులకు కలశాలను అందించారు.

వైభవంగా కుంకుమార్చన..

మందమర్రిటౌన్: పట్టణంలోని త్రిశక్తి అష్టలక్ష్మి కామాక్య దేవాలయంలో బుధవారం కుంకుమార్చాన కలశాల పూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆయా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనల సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చన పూజలకు హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ప్రభుత్వ భూములకు అక్రమ పట్టాలు

5వ పేజీ తరువాయి

ఏకంగా 50 మందికి 55 ఎకరాల భూమిని పట్టాలు చేయడం గమనార్హం. ఈ పట్టాలన్నీ తహసీల్దార్ పేరిట జారీ కావడం కొసమెరుపు. గ్రామంలో కొందరిపేరిట అక్రమ పట్టాలు జారీకాగా, ఈ తతంగం వెనుక కొందరు నాయకుల చేతివాటం ఉందన్న ప్రచారం జరుగుతోంది. పట్టాలు జారీఅయిన లబ్ధిదారుల్లో కొందరు తమ పేర్లపైకి భూములు ఎలా వచ్చాయో తెలియదని వాదిస్తుండగా, అలా పట్టాలు పుట్టుకురావడం వెనుక ఎవరి ప్రమేయం ఉందో తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం లోతుగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామంలో పలువురి పేరిట జారీ అయిన పట్టాల వివరాలు...

- జంబోజి కళావతి పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/2లో రెండు ఎకరాలను 24-12-2022న లావుని పట్టా జారీ కాగా పాస్‌బుక్ సైతం అందజేశారు.
- కుటికేల లక్ష్మి పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/1/1/1/1/2లో ఎకరం 24-12-2022న లావుని పట్టా జారీ అయింది.
- తీగల వెంకయ్య పేరిట సర్వే నంబర్ 49/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/2లో ఎకరం 01-10-2023న లావుణిపట్టా జారీ అయింది.
- పల్లె సాయక్క పేరిట సర్వే నంబర్ 49/1/1/1/1/1/2 లో ఎకరం భూమి 24-12-2022న లావుణి పట్టా జారీ అయింది.
- అల్లంల లక్ష్మి పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/1/లో రెండు ఎకరాల భూమి లావుణి పట్టాగా మారింది.
- కుటికెల సూరవ్వ పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/2లో ఎకరం భూమికి 06-12-2024న లావుణి పట్టా ఇచ్చారు.
- గోదర్ల భాగ్య పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1లో రెండెకరాలు 20-10-2024న పట్టా ఇచ్చారు.
- కుటికెల పద్మ పేరిట సర్వే నంబర్ 9/అ/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1/1లో రెండెకరాలు 20-10-2024న పట్టా జారీ అయింది.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జైపూర్, బెల్లంపల్లి ఏసపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, తహసీల్దార్‌లు, ఎస్ఐలు, సీఐలు , అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్‌ను కలిసిన కలెక్టర్

నస్పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీలో గల సింగరేణి అతిథి గృహానికి వచ్చిన రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదిని బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

మంచిర్యల క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఓవర్ బ్రిడ్జీ వద్ద నివాసముంటున్న అంజయ్య(57) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంజయ్య కొంతకాలంగా మద్యానికి బానిసకాగా ఆరోగ్యం క్షీణించింది. బుధవారం తెల్లవారుజామున అంజయ్యకు ఛాతినొప్పిరాగా గమనించిన వాచ్‌మెన్ అశోక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అంజయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అంజయ్య మృతిపై అనుమానం ఉందని అతడిభార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం : ముగ్గురికి గాయాలు

కన్నెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పిచ్చి కుక్క బుధవారం స్వైరవిహారం చేసింది. కుట్రంగి హర్ష అనే మూడు సంవత్సరాల బాలుడిపై అంగన్‌వాడీ కేంద్రం వద్ద కుక్క దాడి చేయగా తలకు గాయమైంది. దీంతో కుటుంబీకులు భీమినిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాజర్, కుట్రంగి చంద్రక్కపై కుక్క దాడిచేసి కరవడంతో గాయాలపాలయ్యారు. సానికులు వీరిని భీమిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు గ్రామాల్లో తిరుగుతూ దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

మంచిర్యాలక్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఒడ్డెర కాలనీకి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అదే కాలనీకి చెందిన బచ్చలి సన్ని కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఓ మహిళ నల్లా వద్ద నీళ్లు పడుతుండగా కనుబొమ్మలు ఎగురవేస్తూ అసభ్యకరంగా సైగలు చేస్తూ మహిళను వేధించాడు. బాధితురాలి ఫిర్యాదుతో సన్నిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు

తాండూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బన మండలం కైరిగాం నుంచి లావణ్య-రాజేశం దంపతులు ద్విచక్రవాహనంపై బెల్లంపల్లికి వెళ్తున్నారు. ఇదేసమయంలో తాండూర్‌లోని ఓ పెట్రోల్ బంక్ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన టాటా ఏస్ వాహనం వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో లావణ్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు.

గ్రామ పంచాయతీ తనిఖీ

తాండూర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల పంచాయతీ అధికారి జి అనిల్ కుమార్ బుధవారం రేచిని గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శానిటేషన్, రికార్డులు, నర్సరీని పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో నిర్మించే పశువుల పాకలను సందర్శించారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

చెన్నూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామశివారులో గంజాయి సేవిస్తున్న 11 మంది యువకలను పట్టుకుని వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కిష్టంపేట గ్రామానికి చెందిన సాజిద్, ముంజం రాజేష్ చెన్నూరు పట్టణానికి చెందిన సకినారపు సంతు, సయ్యద్ అజద్, ఎండీ కాదరుద్దీన్, బొగె రవితేజ, భుక్య దేవరాజు, ఎండీ తౌఫిక్, నందు, మరో ఇద్దరు మైనర్లు కిష్టంపేట గ్రామశివారులో పెట్రోలింగ్ పోలీసులకు తారస పడడంతో వారిని సోదాచేయగా వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. కాగా ఆ ప్రాంతంలో వీరు రోజు గంజాయి సేవిస్తున్నారని తెలిపారు. వారిని విచారించగా తామంతా మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లి అక్కడి గంజాయి ముఠా సభ్యుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు తెలిపారు. 11 మంది యువకులపై కేసు నమోదు చేశామని, నందు అనే యువకుడు పరారీలో ఉన్నాడన్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత మంచిర్యాలలో పులి సంచారం వదంతులు

మంచిర్యాల క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల, రాళ్లవాగు కొండపోచమ్మ సమీపంలో బుధవారం పులి సంచరించిందంటూ వదంతులు వెల్లువెత్తాయి. స్థానిక రైతు ఎద్దులను తీసుకొని వెళ్తుండగా పులి కనబడిందని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్‌వో సుభాష్ కాలిముద్రలను పరిశీలించారు. అడుగులు పులివికావని అటవీ కుక్కలవని ఆయన తెలిపారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని కర్రలు చేతపట్టుకొని వెళ్లాలని సూచించారు.


అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

- బహుమతులు ప్రదానం చేసిన డీఈవో

లక్సెట్టిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెండ వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలను బుధవారం నిర్వ హించారు. సుమారు 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్విజ్‌పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో యాదయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకుకే క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు జనరల్ నాలెడ్జి కూడా విద్యార్థులకు చాలా అవసరం అని ప్రతీ విషయంపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు యశోదర, సెక్రెటరీ నీరజ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:20 గురువారం
సహర్ 5:14 శుక్రవారం

పట్టభద్రుల స్థానంలోనూ బీజేపీ విజయం 6

సీజన్‌కు ముందే నకిలీ విత్తన దందా.. 7

ప్రభుత్వ భూములకు అక్రమ పట్టాలు..



అక్రమ పట్టాలు పుట్టుకొచ్చిన అందుగుల పేటలోని ప్రభుత్వ భూమి

- దండేపల్లి మండలంలో 55 ఎకరాలు అన్యాక్రాంతం
- అక్రమంగా లావుణి పట్టాలు, పాసు పుస్తకాలు జారీ
- అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే బదలాయింపు
- ఈ తతంగం వెనుక చేతులు మారిన లక్షల రూపాయలు

మంచిర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములకు అక్రమ పట్టాలు పుట్టుకొచ్చిన ఘటన ఇటీవల దండేపల్లి మండలం అదుగుల పేటలో వెలుగు చూసింది. సర్కారు భూములను అక్రమంగా కట్టబెట్టిన అధికారులు వాటికి లావుణి పట్టాలు జారీ చేశారు. పైగా అసైన్‌మెంట్ కమిటీ ప్రమేయం లేకుండానే నేరుగా మండల రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేయడం గమనార్హం. అక్రమంగా లావుణి పట్టాలు జారీ చేయడమేగాక వాటికి పాసుపుస్తకాలు కూడా పుట్టుకురావడం కొస మెరుపు. ఆ పుస్తకాల ఆధారంగా లబ్దిదారులు లక్షల రూపాయల బ్యాంకు రుణాలు కూడా పొందడం మరో ట్విస్టు. ఈ మొత్తం వ్యవహారం వెనుక లక్షల రూపాయలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

55 ఎకరాలు అన్యాక్రాంతం...

దండేపల్లి మండలం అందుగులపేటలో సర్వే నంబర్లు 9, 49లో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అందులో అసైన్‌మెంట్ చట్టాన్ని తుంగలో తొక్కుతూ గ్రామానికి చెందిన 50 మంది పేర్లను అక్రమంగా రికార్డుల్లో నమోదు చేసిన మండల రెవెన్యూ అధికారులు వారి పేరిట 55 ఎకరాలకు పట్టాలు జారీ చేశారు. సర్వే నంబర్ 9లో 28 ఎకరాలకు పట్టాలు పుట్టుకురాగా, సర్వే నంబర్ 49లో మరో 27 ఎకరాలు ఇతరుల పేరిట పట్టాలుగా మారాయి. సదరు భూముల ధర బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా ఎకరా రూ. 50 లక్షల పై చిలుకు పలుతుండగా, స్థానిక నాయకులు కొందరు సహకారంతో అధికారులు పట్టాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

● అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే...

ప్రభుత్వ భూములను ఇతరుల పేరిట లావుణి పట్టాగా మార్చాలంటే అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం ఉండాలి. రెవెన్యూ డివిజన్ పరిధిలో అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియోజకవర్గ ఎమ్మెల్యే వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా ఆర్డీవో, సభ్యుడిగా మండల తహసీల్దార్ ఉంటారు. వారి ఆమోదంతో ఎలాంటి జీవనాధారం లేని నిరుపేద వర్గాలకు చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ కులస్థులకు నిబంధనల మేరకు ప్రభుత్వ భూములను సాగు చేసుకునేందుకు అసైన్ చేసే వెసులుబాటు ఉంది. అయితే ఇందుకోసం ముందుగా గ్రామంలో అర్హులుగా పేర్కొంటూ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆ తీర్మానం ఆధారంగా అసైన్‌మెంట్ కమిటీ సమావేశం కావాల్సి ఉంటుంది. అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆ సమావేశంలో దరఖాస్తుదారుల అర్హతలను బట్టి భూములను కేటాయిస్తారు. అయితే జిల్లాలో చివరిసారిగా 2012-13లో అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఎక్కడాకూడా అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయకపోగా, ప్రభుత్వ భూములకు లావుణి పట్టాలు జారీచేసే ప్రక్రియ నిలిచిపోయింది. అయినప్పటికీ రెండు, మూడు సంవత్సరాల వ్యవధిలో...

మిగతా 7లో

విచారణ జరుపుతాం..



దండేపల్లి మండలంలోని అందుగులపేటలో అక్రమంగా ప్రభుత్వ భూమికి పట్టాలు జారీ అయిన విషయం ఇప్పటిదాకా నా దృష్టికి రాలేదు. నేను తహసీల్దార్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి అధికారికంగా ఎవరికీ భూ పంపిణీ జరగలేదు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- సంధ్యారాణి, దండేపల్లి తహసీల్దార్

'మహా ప్రస్థానానికి' సౌర వెలుగులు

రూ. 25 లక్షల వ్యయంతో మంచిర్యాలలో ఏర్పాటు

మంచిర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న హిందూ మహా ప్రస్థానం (శ్మశానవాటిక)ను పూర్తిగా సోలార్ వెలుగులతో నింపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోదావరి సమీపంలోని భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఈ మహా ప్రస్థానం ఏర్పాటు చేస్తున్నారు. రూ. 11.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టగా ఇందుకు 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. వంద రోజుల్లోగా మహా ప్రస్థానం పనులు పూర్తికావడం విశేషం. కాగా రాష్ట్రంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి సౌర విద్యుత్ వినియోగంతో గ్రీన్ క్రిమిటోరియం నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా రూ. 25 లక్షల వ్యయంతో సోలార్ ఫలకలు ఏర్పాటు చేశారు. దీని ద్వారా 50 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. మహా ప్రస్థానం అవసరాలకు నిత్యం 200 యూనిట్ల వరకు విద్యుత్ అవసరం అవుతుందిజ అదనంగా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను పవర్‌గ్రిడ్‌కు అనుసంధానించి ఎన్పీడీ సీఎల్‌కు విక్రయిస్తారు. తద్వారా నెలకు రూ. 60 వేల నుంచి 70వేల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారు లు అంచనా వేస్తుండగా, ఆ ఆదాయంతో మహా ప్రస్థానం నిర్వహణ చేపట్టనున్నట్లు చెబుతున్నారు.



మంచిర్యాలలోని మహా ప్రస్థానం (ఓవర్ వ్యూ)



మహా ప్రస్థానంలో ఏర్పాటు చేసిన సౌర ఫలకలు

ప్రభుత్వ నమూనాలో ఇళ్లు నిర్మించుకోవాలి

భీమిని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి : ప్రభుత్వం నిర్ణయించిన నమూనా ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ బన్సీ లాల్ సూచించారు. బుధవారం మండలంలోని మల్లీడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథక లబ్దిదారులకు అవగాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి నిర్మాణ లబిదారులు స్థలాన్ని శుభ్రంగా చేసుకోని సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగామోహన్, హౌసింగ్ ఏఈ లాయక్ అలీ, పంచాయతీ కార్యదర్శి పున్నం నాయక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి లైంగిక వేధింపులు

మందమర్రిరూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని ప్రభుత్వ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నైతం శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడు తున్నట్లు బుధవారం బాధిత ఉపాధ్యాయురాలు రామకృష్ణపూర్‌లో ఫిర్యాదు చేసింది. రామకృష్ణపూర్ ఎస్ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేపడుతున్నామని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

● డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

గర్మిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యో): స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు కఠిన తీసుకుంటామని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం మంచిర్యాలోని బాలాజీ, కీర్తి స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వపరంగా ఐదు, ప్రైవేటు పరంగా 47 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలోని 52 స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీల కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కృపాబాయి, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ వసు మతి, ఎస్డీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న డీఈవో యాదయ్య

లక్సెట్టిపేట రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. బుధవారం మండలంలోని జెండవెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానం చెప్పడంతో అభినందించి సన్మానించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఇప్పటి నుంచే ఒక లక్ష్యం ఎంచుకుని పట్టుదలతో చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యశోధర, ఇంచార్జ్ ప్రధానోపాధ్యా యుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివయ్య, దుర్గాప్రసాద్, జ్యోతిర్మయి, వాణిశ్రీ, రమేష్, సతీష్, రెహనాబేగం, రవీందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఈ నెల 10,11,12 తేదీల్లో జరిగే దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. మంచిర్యాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశాలకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రవి, లక్ష్మణ్, ఏసేపు, తిరుపతి, రవికుమార్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు

- ఎస్ఈ గంగాధర్



నస్పూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ గంగాధర్

నస్పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు మెరుగైనా సేవలందించాలన్న లక్ష్యంతో నస్పూర్ సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల ఎస్ఈ గంగాధర్ అన్నారు. నస్పూర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం 8 ఎంవిఏ పీటీఆర్ చార్జింగ్, 11 కేవీ కలెక్టరేట్‌కు ఎక్స్‌ప్రెస్ ఫీడర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ గంగాధర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సరఫరాను అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఇ కైసర్, ఎంఆర్‌టీ డీఇ రాజన్న, ఏడీఈ మోహన్‌రెడ్డి, ఎస్పీఎం ఏడీఈ శరత్, ఎస్పీఎం ఏఇ కలీం, ఏఇ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' కల్పించాలి

● ఎంపీడీవో సరోజ

లక్సెట్టిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు లేవని ఏవరూ చెప్పకూడదని ఎంపీడీవో సరోజ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీవో మీటింగ్ హాలులో బుధవారం ఉపాదిహామీ సిబ్బందితోపాటు పంచాయతీ సెక్రెటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ 80మంది, మేట్‌లు ఉన్న గ్రామాల్లో 40మందికి తక్కువ కాకుండా ప్రతీరోజు పనులు చేపట్టాలన్నారు. పంచాయతీ సెక్రటరీలతో పాటు గ్రామ పెద్దల సమన్వయంతో పనులు సృష్టించుకోవాలని ఆదేశించారు. ప్రతీ గురువారం లేబర్ ఇంప్రూమెంట్ చేపట్టకపోతే సిబ్బందిపై ఉన్నతాధికారులకు నివేదికను పంపించడంతో పాటు శాఖపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

చెన్నూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొక్కూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీపనులను బుధవారం ఈజీఎస్ ఏపీవో గంగాభవానీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు కొలతల ప్రకారం పనిచేస్తే ఒక కూలీకి రూ. 300 చెల్లించడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే పనిచేయాలని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న వారు పశువుల కొట్టాలు, మేకల కొట్టాలు, కోళ్ల షెడ్లు, అజోల్లా గడ్డి పెంపకం, నాడెపు కంపోస్టు పిట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆమె వెంట టీఏ రవికుమార్, ఎఫ్ఏ వెంకటస్వామి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజ

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష హాల్‌లోకి క్యూలో వెళ్తున్న విద్యార్థులు

మంచిర్యాల క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఐపీఈ థియరీ ఎగ్జామ్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం జనరల్ విద్యార్థులు 6,597 విద్యార్థులు కాగా 6,372 మంది హాజరుకాగా 225 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 668 మంది విద్యార్థులు కాగా 600 మంది హాజరుకాగా 68 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి అంజయ్య తెలిపారు. అన్ని సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి చేరుకున్నారు. కొందరు సమయానికి రావడంతో పరుగులు తీశారు. పోలీసు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

దండేపల్లి: మండలంలో 141 మంది విద్యార్థులకు గాను 137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ బి శోభ, డిపార్ట్‌మెంటల్ అధికారి సాయికుమార్ వెల్లడించారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ సంధ్యరాణి, ఫ్లయింగ్ స్క్వాడ్ సందర్శించారు. ఎస్ఐ తైసినోద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం మొదటి రోజు ప్రశాంతంగా సాగింది. మండల కేంద్రంలో మొత్తం రెండు సెంటర్లను ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసింది. రెండు సెంటర్లలో కలిసి 520విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 26మంది పరీక్షకు గైరాజరు కావడంతో 494మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీటితో పాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాలను పట్టణ సీఐ నరేందర్‌తో పాటు తహసీల్దార్ దిలీప్ కుమార్ పరిశీలించారు.

మందమర్రిరూరల్ : మండలంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 311 మంది విద్యార్థులకు గాను 303 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అమీరున్నీసా తెలిపారు. డీవో అనిత పరీక్షను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెన్నూర్‌లో 14 మంది గైర్హాజరు

చెన్నూరు : బుధవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ పరీక్షల్లో 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 214 మంది విద్యార్థులకు గాను 207 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అరుణావతి తెలిపారు. అలాగే సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులకు గాను 193 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ స్రవంతి పేర్కొన్నారు.



రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

జన్నారం : మండలంలో మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రశాం తంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 145 మందికి గాను 134 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీని వాస్ తెలిపారు. కరిమల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 129 మంది విద్యార్థులకు 121 మంది హాజరు కాగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు·

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జైపూర్ : పరీక్షలు జరిగే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని డిపార్టుమెంటల్ అధికారి బాలాజీని అడిగి తెలుసుకున్నారు. మొదటిరోజు 247 మంది విద్యార్థులకు 239 మంది విద్యార్థులు హాజరయ్యారని కలెక్టర్‌కు తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తెచ్చేటప్పుడు, పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను తీసుకుని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్టు ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి, సిట్టింగ్ స్క్వాడ్ శ్రీనివాస్, చీఫ్ సూపరింటెండెంట్ బండి ప్రసాద్, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ శంకర్ ఉన్నారు.



జైపూర్‌లోని పరీక్ష కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్